ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఖాళీగా ఉన్న సుమారు 350 బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం వీసీ ప్రొ.కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 25 ఏళ్లుగా ఓయూలో ఎస్సీ, ఎస్టీ నాన్‌టీచింగ్ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను పదోన్నతులతో భర్తీ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. నోటిఫికేషన్ జారీ చేసి బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.

కేసీఆర్‌కు అమ్మవారి చిత్రపటం బహూకరణ



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసారు. కేసీఆర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి మళ్లీ ఆయన ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో నాయకులు గౌస్ ఖరేషీ, అమ్‌జద్, కైసర్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు పోస్టల్ ఇన్సూరెన్స్ బాండ్లు



పోస్టల్ బీమా బాండ్లను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులకు మంగళవారం పోస్టల్ ఇన్సూరెన్స్(పీఎల్‌ఐ) బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ సంక్షేమం, భవిష్యత్తు అవసరాలకు పొదుపు ఎంతో అవసరమని భావించిన పోస్టల్ బీమా విభాగం అధికారి శ్రీనివాసరావు సలహా మేరకు బాండ్లు అందజేస్తున్నట్లు తెలిపారు .చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం



అశ్విని (ఫైల్)

చిలకలగూడ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాకేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..చిత్తూరు జిల్లా, ఎల్లంపల్లి గ్రామానికి చెందిన అశ్విని, వెంకటేష్ దంపతులు నగరానికి వలసవచ్చి సీతాఫల్‌మండి ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 14న భార్యాభర్తలు మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికిలోనైన అశ్విని ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. అశ్విని తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసులో నిందితుడికి రిమాండ్

అడ్డగుట్ట: ఉద్యోగం ఇప్పిస్తానని పలువురిని మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని లాలాగూడ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రఘు బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్, వెంకటేశ్వర నగర్‌కు చెందిన కాలువ భార్గవ్(34) ఓ ఐటీ కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పని చేసిన అనుభవంతో హైటెక్ సిటీలో నియోజీన్ సాఫ్టటెక్ పేరుతో కార్యాలయం ప్రారంభించాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను మోసం చేసి డబ్బులు దండుకునేవాడు. ఇదే తరహాలో లాలాపేటలోని ఆర్య నగర్ ప్రాంతానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి నుంచి రూ. 30 వేలు తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న లాలాగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇది వరకే భార్గవ్‌పై జీడిమెట్ల, మాదాపూర్, కల్వకుర్తి పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కేసులు నమోదై ఉండడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని లాలాగూడ పోలీసులకు అప్పగించడంతో అతడిని రిమాండ్‌కు తరలించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 15, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 21, దొండ 45, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 26, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 21, చామగడ్డ 23, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బస్టాప్‌ల ఎత్తివేతకు కసరత్తు

పాతగాంధీ స్థలంలో ఏర్పాటుకు సన్నాహాలు

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- రెండురోజుల్లో ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం
- సికింద్రాబాద్ స్టేషన్ బస్టాప్ తొలగింపునకు రంగం సిద్ధం



సికింద్రాబాద్ స్టేషన్ ఎదుట నిలిచిన సిటీ బస్సులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లను తరలించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న ట్రాఫిక్, రైల్వే విభాగాల అధికారులు ఆ ప్రాంతంలో పర్యటించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను పూర్తిగా నేలమట్టం చేసి అధునాతన స్టేషన్‌ను నిర్మించేందుకు గాను పెద్ద ఎత్తున పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ కారణంగా అసౌకర్యానికి గురవుతున్న ప్రయాణికులకు ప్రత్యామ్నాయ వసతులు కల్పించేందుకు గాను ఉన్నతాధికారుల బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన అధికారులు టెన్ నెంబర్ బస్‌స్టాప్‌గా పిలిచే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బస్టాప్‌లను ఎత్తివేయడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చునని నిర్ణయించారు.

300 బస్సులు..25 వేల మంది ప్రయాణికులు

ఉన్నతాధికారుల బృందం అధ్యయనం చేసిన మరుసటి రోజే బస్‌స్టాప్‌ల తొలగింపు విషయంలో సాధ్యాసాధ్యాలను ఆర్టీసీ, ట్రాఫిక్ అధికారులు పరిశీలిస్తున్నారు. మూడు షిఫ్టుల్లో మొత్తంగా (సెట్విన్ బస్సులు కలుపుకుని) 300 వరకు సిటీ బస్సులు 10వ నెంబర్ బస్‌స్టాప్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దాదాపు 25 వేల మంది ఆయా బస్‌స్టాప్‌ల ద్వారా ప్రయాణాలు చేస్తున్నారు. ఇంత రద్దీ కలిగిన బస్‌స్టాప్‌ను ఉన్న ఫలంగా ఇక్కడి నుంచి ఎత్తివేస్తే పరిస్థితి ఎలా ఉంటుందన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయి.

అన్ని ప్రాంతాలకు రాకపోకలు

స్టేషన్ బస్టాప్ నుంచి చార్మినార్, మెహదీపట్నం, సనత్‌నగర్–కూకట్‌పల్లి, బోరబండ, మణికొండ, కొండాపూర్, లక్డీకాపూల్ తదితర మార్గాలకు బస్సులు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోకి వాహనాలు ప్రవేశించి, బయటికి వచ్చే రెండు దారుల మధ్య స్టేషన్ బస్టాప్ ఉంది. ఆయా ప్రాంతాల నుంచి రైల్వేస్టేషన్‌కు వచ్చే వారంతా ఇక్కడ బస్సు దిగగానే నేరుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే వెసలుబాటు ఉంది. ఇప్పుడు బస్టాప్‌లను పాత గాంధీ ప్రాంతానికి బదలాయిస్తే బస్సులకు మార్గాలు, ప్రయాణికులకు వసతులు ఎలా కల్పించాలన్న అంశాలపై సుదీర్ఘంగా అధ్యయనం చేస్తున్నారు.



తాత్కాలిక బస్టాప్‌లు ఏర్పాటు చేయనున్న మెట్రోరైల్ (పాతగాంధీ) స్థలం

పాతగాంధీ స్థలంలోకి..

సికింద్రాబాద్ స్టేషన్ బస్టాప్‌లను ఎత్తివేస్తే ప్రత్యామ్నాయంగా తాత్కాలిక బస్టాప్‌లను పాతగాంధీ ఆసుపత్రి స్థలంలో ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. దాదాపు 3 ఎకరాల విస్తీర్ణం కలిగిన పాతగాంధీ స్థలం ప్రస్తుతం మెట్రోరైల్ ఆధీనంలో ఉంది. అవదులో కొంతమేర సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్‌ను నిర్మించారు. మిగతా స్థలమంతా ఖాళీగా ఉంది. ఇక్కడ బస్టాప్‌లు ఏర్పాటు చేస్తే రాకపోకల్లో ఇబ్బందులు, ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

రెండు రోజుల్లో సమీక్ష..

బస్టాప్‌ల ఎత్తివేత అంశంపై చర్చలు జరిపేందుకు జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసులు రెండు మూడు రోజుల్లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఇక్కడి బస్టాప్‌లను తొలగించడం ద్వారా ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చి వెళ్లేందుకు ప్రమాదకర పరిస్థితులు దూరమయ్యే అవకాశం ఉంది. నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్ల పక్కన ఇరుకైన స్థలం నుంచే రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు ఇకపై ఆఇబ్బందులు తొలగిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

అర్హత కలిగిన డాక్టర్లే వైద్యం చేయాలి



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రాంగోపాల్‌పేట్: జిల్లాలో అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే వైద్య సేవలు అందించాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో డీఎంఅండ్ హెచ్‌వో ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫిజియో థెరఫీ సెంటర్ల నిర్వాహకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్లు అర్హత మేరకు మాత్రమే వైద్య సేవలు అందించాలని, రోగులకు సరైన వసతులు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, ఎంటీపీ యాక్ట్, సరోగసీ చట్టంపై అవగాహన కలిగి ఉండటంతో పాటు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ విధానాల్లో భాగస్వామ్యం వహిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటిజం, వెల్‌నెస్ సెంటర్లు, స్పీచ్ థెరఫీ, బరువు తగ్గిస్తామని చెబుతూ ప్రజల నుంచి ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో రిజిష్టర్ కావాలని, ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు విధిగా నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ వెంకటి, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ మినహాజ్ నస్రబాది, తానా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సురేష్‌గౌడ్, డాక్టర్ నౌనిహాల్ సింగ్, డాక్టర్ మంజులరావు, నిరంజన్ రెడ్డి, డాక్టర్ సాయికాంత్, డాక్టర్ తుకారాం రాథోడ్, డాక్టర్ రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

లాలాపేట: రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా నేషనల్ బ్లైండ్ కంట్రోల్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో గాంధీ హాస్పిటల్ ఆప్తమాలజీ డిపార్టుమెంట్ సహకారంతో స్పెషల్ ఐ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎం, హెచ్‌ఓ డాక్టర్ జయశ్రీ తెలిపారు. మార్చి 6 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సోమ, మంగళవారాల్లో ఇప్పటి వరకు లాలాపేటకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. దృష్టిలోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలను అందజేస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్ వీరు కాసర్ల, సిబ్బంది మీనాక్షి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

సికింద్రాబాద్: మెట్టుగూడలో జీహెచ్ఎంసీ నిర్మించిన స్టాల్స్‌లో తిష్టవేసిన కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి 16 స్టాళ్లలో ఒక్కో స్టాల్‌కు ఇద్దరు చొప్పున మొత్తం 32 మంది వ్యాపారాలు చేసుకునే స్థలంలో 12 మంది మాత్రమే పాగా వేసి ఇతర స్ట్రీట్ వెండర్స్‌ను అక్కడికి రానివ్వడం లేదని ఫిర్యాదులు అందాయి. వ్యాపారాలకు సంబంధం లేని వ్యక్తులు, మరికొందరు స్థానిక ప్రజాప్రతినిధులు స్టాల్స్‌ను బినామీ పేర్లతో దక్కించుకుని ఇతరులకు అద్దెలకు ఇచ్చుకుంటున్నట్లు స్ట్రీట్ వెండర్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్టాల్స్‌లో మాత్రమే కూరగాయాలు విక్రయించాల్సి ఉండగా, రహదారుపై దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు మెట్టుగూడ మార్కెట్ స్టాల్స్ వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ స్టాల్స్‌ను స్ట్రీట్ వెండర్లు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. వ్యాపారులు తమ ఆధార్ కార్డులు జీహెచ్ఎంసీ అధికారులకు అందించాలని చెప్పారు. స్టాల్స్‌లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ఆక్రమించి చేస్తున్న వ్యాపారాలను ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు.



రహదారిపై దుకాణాలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

పదవులు బాధ్యతను పెంచుతాయి

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, కామన్ కమ్యూనిటీ మీడియేట్ సభ్యులుగా బేగంపేటకు చెందిన నాగు రఘునాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రఘునాథ్ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు పి.సురేష్‌యాదవ్‌తో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘునాథ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవులను బాధ్యతాయుతంగా నిర్వర్తించినప్పుడే ప్రజల మన్ననలను పొందగలుగుతామన్నారు.

20న సిరిపురం యాదయ్య వర్ధంతి

లాలాపేట: ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో అమరుడైన సిరిపురం యాదయ్య వర్ధంతిని ఈ నెల 20న ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద నిర్వహిస్తున్నట్లు సిరిపురం యాదయ్య స్మారక సమితి చైర్మన్ ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2010 ఫిబ్రవరి 20న ఓయూ విద్యార్థుల పిలుపు మేరకు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా అప్పటి ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద యాదయ్య ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మబలిదానం చేశారని గుర్తు చేశారు. ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద సిరిపురం యాదయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధంతి కార్యక్రమానికి కవులు, కళాకారులు, మేధావులు, పార్టీలకు అతీతంగా తరలిరావాలని కోరారు.

ట్రాక్‌మెన్‌ల సంక్షేమానికి కృషి

అడ్డగుట్ట: రైల్వే ట్రాక్‌మెన్‌ల సంక్షేమానికి దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఎన్‌ఎఫ్‌ఐఆర్ నిరంతరం పోరాడుతున్నాయని సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ట్రాక్‌మెన్‌లు 1800 గ్రేడ్‌పేతో నియామకమై 30 ఏళ్లుగా అదే గ్రేడ్‌పేతో రిటైరయ్యే పరిస్థితి ఉండేదన్నారు. ట్రాక్‌మెన్‌ల అభ్యున్నతికి నాలుగంచెల పే స్ట్రక్చర్ ద్వారా 2800 గ్రేడ్ పే చేరుకునే అవకాశాన్ని సాధించిన ఘనత ఎన్‌ఎఫ్‌ఐఆర్, ఎస్సీఆర్‌ఈఎస్‌కు దక్కుతుందన్నారు. డీసెంట్రలైజేషన్ ద్వారా ట్రాక్‌మెన్‌లకు జూనియర్ ఇంజనీర్ ప్రమోషన్ అవకాశాలు మెరుగు పరిచామన్నారు. అనునిత్యం రిస్క్‌తో ఉన్న విధులు నిర్వహిస్తున్న వారికి రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్‌ను కూడా సాధించినట్లు గుర్తు చేశారు.

కంటోన్మెంట్‌లో భూ బదలాయింపు చేపట్టండి



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని రక్షణ స్థలాల్లో వెలిసిన బస్తీలను భూ బదలాయింపు కింద రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి మార్చాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రక్షణ స్థలాలు, సివిల్ ఏవియేషన్ భూముల్లో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆయా స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం బదలాయించుకుని పట్టా లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా సుమారు 10వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని సీఎంకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి బదలాయించుకున్న భూముల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఎమ్మెల్యే వినతిని పరిశీలించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. సీఎం ఆదేశాలతో వీలైనంత త్వరలోనే భూబదలాయింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రైల్ నిలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: రైల్వే కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట మజ్దూర్ యూనియన్ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, రన్నింగ్ స్టాఫ్ డీఏకి అనుగుణంగా అలవెన్స్ పెంచాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ పెంచాలని, బ్రిటీష్ కాలం నాటి మ్యానువల్స్ మార్చి ఇంజినీరింగ్ కార్మికులపైన పని భారం తగ్గించాలని కోరారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న మహిళలకు ఇతర విభాగాల్లోకి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. అనంతరం రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, మురళీధర్, సరోజినీరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవయ్య, బుచ్చిరెడ్డి, రవీందర్, వరప్రసాద్, ఖాజబాబా, చిలుక స్వామి, రామ్మోహన్, యుగంధర్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లపై టాస్క్‌ఫోర్స్ దాడులు



తుకారాంగేట్‌లో ఇసుకను సీజ్ చేసిన అధికారులు

అడ్డగుట్ట: అక్రమంగా ఇసుక విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మండల అధికారులతో కలిసి తుకారాంగేట్‌లోని ఇసుక డంప్‌పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు, సరైన పత్రాలు లేకుండా ఇసుక విక్రయాలకు పాల్పడుతున్న షాపులపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా తుకారాంగేట్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద రాజ రాజేంద్ర ట్రేడర్స్‌కు చెందిన 15 టన్నుల ఇసుకను మండల అధికారులతో సీజ్ చేయించినట్లు చెప్పారు. ప్రస్తుతం ముందస్తు హెచ్చరికల్లో భాగంగా ఇసుక సీజ్ చేశామని, ఇకపై అక్రమంగా ఇసుక విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని షాపు యజమాని కేతం రాజేంద్రను హెచ్చరించారు. దాడుల్లో మారేడుపల్లి మండల ఆర్‌ఐ సర్వేష్ పాల్గొన్నారు.